నవతెలంగాణ
నమ్మగ తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 22, 2023 | www.navatelangana.com

నిరుపేద కుటుంబానికి సాయం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పెద్దనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సోమగూడెం న్యూకాలనీకి చెందిన శ్రీరాముల రవి అనారోగ్యంతో బాధపడుతుండగా సర్పంచ్ వేముల కృష్ణ, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దాసరి వెంకటరమణ అండగా నిలిచారు. ఇంటికి వెళ్లి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందించారు. ముందుగా వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఫోన్ పే, గూగుల్ పే(రవి సెల్ నెంబర్ 9100395055) ద్వారా తోచిన సహాయం అందించాలని కోరారు.



24న నాగదాసు స్మారక సాహిత్య పురస్కార సభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రముఖ తత్వకవి ఉదారి నాగదాసు స్మారక సాహిత్య పురస్కారాన్ని 2023 సంవత్సరానికి నల్లగొండ జిల్లాకు చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు ఏనుగు నరసింహారెడ్డికి ప్రదానం చేస్తున్నట్లు నిర్వాహకులు ఉదారి నాగదాసు కుటుంబ సభ్యులు డా.ఉదారి నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవార్డు కింద రూ.5వేల నగదు, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. అవార్డు ప్రదానోత్సవ సభ 24న ఆదివారం సాయంత్రం 4గంటలకు జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రామ్ అంతర్వేది, హైదరాబాద్ నుంచి ప్రముఖ కవి, విమర్శకుడు, భూవైజ్ఞానిక శాస్త్రవేత్త డా.రూప్ కుమార్ డబ్బీకార్, ప్రముఖ రచయిత, చిత్రకారుడు సామల రాజవర్ధన్, సామల వీరన్న, విజయ డెయిరీ అసిస్టెంట్ డైరెక్టర్ మధుసూదన్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు, కళాకారులు, సాహితీ అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భారీ వర్షానికి కూలిన జీపీ భవనం



నవతెలంగాణ - కౌటాల

భారీ వర్షానికి మండలంలోని వీరవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం కూలిపోయింది. గురువారం ఉదయం ఎవరూ లేని సమయంలో కూలడంతో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. కౌటాల, రవీంద్రనగర్ మధ్యగల చింతలపాటి వాగు వంతెనపై నుండి ఉప్పొంగి ప్రవహించడంతో ఉదయం నుండి సాయంత్రం వరకు రాకపోకలు నిలిచిపోయాయి.

క్రీడల్లో రాణించడానికి పేదరికం అడ్డు కాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

క్రీడల్లో రాణించడానికి పేదరికం అడ్డు కాదని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్దన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో క్రీడా పోటీలను ఆయన గురువారం ప్రారంభించారు. ఉమ్మడి జిల్లా నుంచి 11 పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది ప్రతిభగల క్రీడాకారులు ఉన్నారని పేర్కొన్నారు. వెయిట్ లిఫ్టర్ మీరాబాయి జానును ఆదర్శంగా తీసుకొని గొప్ప క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ దిశగా తమ తరపున సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

పశువులకు గర్భకోశ చికిత్సలు



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో గురువారం పశు వైద్యాధికారి డాక్టర్ సుభాష్ రాథోడ్ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ చికిత్స అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపాలమిత్రలు పశు పోషకులకు ఎంతో ఉపయోగపడుతున్నారన్నారు. గేదెలకు గర్భకోశ చికిత్సలు చేయడంలో వీరు కీలకంగా ఉన్నారన్నారు. చికిత్సలో భాగంగా 42 మంది రైతులకు చెందిన 73 ఆవులు, గేదెలకు ఉచిత గర్భకోశ చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ చైర్మెన్ బక్కి గోవర్ధన్ యాదవ్, గ్రామ సర్పంచ్ కేమ కళ్యాణి గంగయ్య వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, గోపాలమిత్ర మల్లికార్జున్ పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని ఇందిరానగర్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నైతం శంకర్ జిల్లా ఇంటర్ మీడియట్ విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వచ్చిన నేపథ్యంలో సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతి బాధ్యతను పెంచిందని, ఇదే సందర్భంలో ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో జిల్లా విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రెగ్యులర్ అయిన లెక్చరర్లు మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా శంకర్ తమకు ఎంతగానో సహకారం అందించారన్నారు. ఆయన ఇంటర్ మీడియట్ విద్యాధికారిగా ఉద్యోగోన్నతి పొందడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు రాందాస్, అమరేందర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



నవతెలంగాణ-కడెం

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2023 రాష్ట్ర అవార్డుకు ఎంపికై అవార్డు అందుకున్న సందర్భంగా నచ్చన్ ఎల్లాపూర్ సర్పంచ్ బొడ్డు గంగన్న, కార్యదర్శి రమాదేవి, ఉపసర్పంచ్ ఆనంద్‌ను పెత్తర్పు ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రంలో హెచ్‌ఎం భీమలింగం, ఉపాధ్యాయులు ప్రతాప్, చిన్నయ్య, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు సునారికారి రాజేష్, రైతు కూలి సంఘం నాయకులు దుర్గం లింగన్న, అంగన్వాడీ టీచర్స్ లక్ష్మి, సుమలత, ఎఫ్ఏ కమలాకర్, విద్యాకమిటీ చైర్మన్ భాగ్యలక్ష్మి, ఐకేపీ వివో లక్ష్మి, నారాయణ, వెంకటేష్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని
జీఎం కార్యాలయం ముట్టడి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయాన్ని ముట్టడించారు. జీఎం సంజీవరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య మాట్లాడుతూ గత సంవత్సరం 18 రోజులు నిరవధిక సమ్మె సందర్భంగా యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మిక సంఘాలతో జరిగిన ఒప్పందాలను నేటికీ అమలు చేయలేదని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలవుతున్న హైపర్ కమిటీ వేతనాలు లేదా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో నెంబర్ 22ను కాంట్రాక్ట్ కార్మికులకు వర్తింపజేయాలని సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి గెజిట్ కొరకు పంపిస్తే నేటి వరకు ప్రభుత్వం గెజిట్ చేయలేదన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు, కుటుంబ సభ్యులకు వైద్య సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల 7న జీతాలు చెల్లించాలని యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసినా దాన్ని అమలు పరచడంలో వైఫల్యం చెందిందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోల్ ఇండియాలో అమలవుతున్న కనీస సౌకర్యాలు లేవని, సిక్‌లు అమలు చేయాలని, సింగరేణిలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను సీనియార్టీ ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు మూడు సంవత్సరాల నుండి సీఎంపిఎఫ్ రికవరీ అయినప్పటికీ వాటి లెక్కలను చూపడం లేదన్నారు. వెంటనే సీఎంపిఎఫ్ లెక్కలను సరిచేసి కార్మికులందరికీ సీఎంపిఎఫ్ చిట్టీలను అందించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కూడా ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, ఉపాధ్యక్షులు చంద్రమోహన్, ఖాతా రాజు ప్రభాకర్, కార్యదర్శి వీరేశం, కోశాధికారి నాగరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి, స్వప్న, నాయకురాలు లక్ష్మి, సమ్మయ్య శ్రీనివాస్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని అధికారికంగా నిర్వహించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జయంతి మాదిరిగానే కొండా లక్ష్మణ్‌బాపూజీ వర్ధంతినీ అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ చేనేత ఐక్య వేదిక పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి రమేష్ కోరారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చౌక్‌లో ఆయన 11వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. లక్ష్మణ్ బాపూజీకి పూలదండలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని, వర్ధంతిని కూడా అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కల సాకారం కావడానికి లక్ష్మణ్ బాపూజీ కృషి ఎనలేనిదని కొనియాడారు. కార్యక్రమంలో తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శి మోర ఆశన్న, జిల్లా అధ్యక్షులు అలిశెట్టి నాగన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శులు దాసరి ఆశన్న, హన్మాండ్ల ఈరన్న, పెంట వెంకన్న, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం నందుకుమార్, గాజుల జగన్నాథ్, చాట్ల స్వామి పలువురు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

దస్తురాబాద్ : మండలంలోని గొడిసిర్యాల ప్రాథమిక పాఠశాలలో గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్: లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ధన్నూర్(బి) గ్రామంలో నిర్వహించారు. ఆయన విగ్రహానికి నివాళులు అర్పించి మండల అధ్యక్షుడు ఆసాల సదాశివ మాట్లాడారు. బాపూజీ సేవలను గుర్తు చేశారు. ఆయన చూపిన బాటలో పద్మశాలి సమాజం నడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ గంగారాం, పట్టణ అధ్యక్షులు సామల సంతోష్, ప్రధాన కార్యదర్శి రామ్, నాయకులు శంకర్, ఎర్రన్న, రాజేశ్వర్, రాజశేఖర్, బుచ్చన్న, స్వామి, నర్సయ్య, రాజు, నవీన్ పాల్గొన్నారు.

బెజ్జూర్ : మండల కేంద్రంలో గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పద్మశాలీ సేవా సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం లక్ష్మణ్ బాపూజీ సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం మండల ప్రధాన కార్యదర్శి కనుకుట్ల వెంకటేష్, సభ్యులు పర్ష గణేష్, రమేష్, శ్రీనివాస్, శ్రీకాంత్, శంకర్, శేఖర్, సతీష్, వెంకటేశ్ పాల్గొన్నారు.



నిమజ్జనోత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-హాజీపూర్

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని నవరాత్రులు అనంతరం నిర్వహించనున్న నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని సామరస్యంతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం వినాయక నిమజ్జనం కోసం జిల్లాలోని మంచిర్యాల పట్టణం, గుడిపేట గోదావరి తీరంతో పాటు దండేపల్లి మండలం గూడెం వద్ద గోదావరి నది తీరంలో గుర్తించిన ప్రాంతాలను అదనపు కలెక్టర్ బి.రాహుల్, సబావత్ మోతీలాల్, డిసిపి సుధీర్ రామ్నాథ్ కేకన్, మంచిర్యాల ఆర్‌డిఓ రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, 28న మిలాద్-ఉన్-నబి వేడుక ఉన్నందున ప్రజలంతా మత సామరస్యంతో పండుగలను సంతోషంగా జరుపుకోవాలని తెలిపారు. నవరాత్రుల అనంతరం నిమజ్జనోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జన ప్రాంతాలలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, భారీ విగ్రహాల నిమజ్జనానికి క్రేన్లను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమాలలో మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, మంచిర్యాల, హాజీపూర్, లక్సెట్టిపేట, దండేపల్లి మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు శ్రీహరిరావు సంఘీభావం

నవతెలంగాణ-సారంగాపూర్

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు శ్రీహరిరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రమ దోపిడీ ఉండదని కేసిఆర్ చెప్పారని, అయినా నేటికీ పనికితగ్గ వేతనం లభించడం లేదని ప్రభుత్వంపై మండిపడ్డాడు. ఏండ్లుగా పనిచేస్తున్న అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు కాంగ్రెస్ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట నిర్మల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నాందేడపు చిన్ను, సారంగాపూర్, దిలావర్‌పూర్ మండల పార్టీ అధ్యక్షులు బోలోజి నర్సయ్య, రవీందర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఇమ్రాన్, ఎస్కే సలీం, రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాజు, అరవింద్ ఉన్నారు.



వర్షంలోనూ అంగన్‌వాడీల సమ్మె



నవతెలంగాణ-తాంసి

సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు తాంసి, భీంపూర్ మండలాల్లో గురువారం వర్షాన్ని కూడా లెక్కచేయకుండా టెంట్ కింద గొడుగులు పట్టుకొని కూర్చున్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ పదకొండు రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించడం సరికాదన్నారు. కార్యక్రమంలో విజయ, లక్ష్మి, భాగిర్త, విఠాబాయి, సునీత పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీలు గురువారం వర్షంలో సైతం నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు సుభద్ర మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపాలని కోరారు.

పశువైద్యంపై అవగాహన కలిగి ఉండాలి

- పశువైద్య యూనివర్సిటీ డీన్ రఘునందన్




నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

పశువుల్లో సోకే వ్యాధులు, వాటికి అందించాల్సిన వైద్యం పట్ల పశుపోషకులు అవగాహన కలిగి ఉండాలని కోరుట్ల పశువైద్య యూనివర్సిటీ డీన్ డాక్టర్ రఘునందన్ తెలిపారు. కోయవాగు గ్రామంలో పశువైద్య యూనివర్సిటి కోరుట్ల ఆధ్వర్యంలో జాతీయ పశుధన్ జాగృతి అభియాన్‌లో భాగంగా గురువారం పశు పోషకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పశువుల్లో గర్భకోశ వ్యాధులు వాటి చికిత్స, అంటువ్యాధులు వాటి చికిత్స నివారణ చర్యలపై వివరించారు. పశువులు త్వరితగతిన ఈతకు రావడానికి, చూడి నిలువడానికి, ఈసుకుపోకుండా ఉండటానికి, శరీర ఎదుగుదలకు కావలసిన పోషకాలు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ నరసింహరావు, డాక్టర్ రఘునందన్, మాధవరావు, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నాగరాజు, ఆసిఫాబాద్ పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ కుమార్, కాగజ్‌నగర్ పశువైద్యాధికారి డాక్టర్ యం.విజయ్, పశువైద్య సహాయులు, రాజ్‌కుమార్, శైలేందర్, ప్రభలకుమార్ పాల్గొన్నారు.

నెలాఖరులోగా సీఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్



నవతెలంగాణ-నస్పూర్

నెలాఖరులోగా సిఎంఆర్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్‌తో కలిసి అధికారులు, రైస్‌మిల్లుల యజమానులతో సిఎంఆర్ లక్ష్యాలు పూర్తి చేయడంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2021-22 సీజన్‌కు సంబంధించి బకాయి ఉన్న సిఎంఆర్ లక్ష్యాలను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి వానాకాలం, యాసంగి సీజన్ల ధాన్యాన్ని రైస్ మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా కేటాయించిన లక్ష్యాల సిఎంఆర్‌ను ప్రతిరోజు నివేదిక అందించాలని తెలిపారు. జిల్లాలోని ఆయా మిల్లులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయని వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు 2023-24 వానాకాలం సంబంధించిన ధాన్యం కేటాయింపు జరగదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ గోపాల్, రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకూ లాభాల్లో వాటా కేటాయించాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో 20 సంవత్సరాలుగా పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకూ లాభాల్లో వాటా కేటాయించాలని సింగరేణి కాలరీస్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు (ఎస్‌సిసిడబ్ల్యూయు-ఐఎఫ్‌టియు) డి. బ్రహ్మానందం పేర్కొన్నారు. గురువారం కాంట్రాక్ట్ కార్మికులతో జిఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం జిఎం సంజీవరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కాంట్రాక్టీకరణ ప్రారంభమై సుమారు 25 సంవత్సరాలు అవుతుందని, సింగరేణి వ్యాప్తంగా సుమారు 30వేల మంది కాంటాక్ట్ కార్మికులు వివిధ డిపార్మెంట్లలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్మికులకు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలు చేస్తున్నట్లు సింగరేణి యాజమాన్యం పండగ సెలవులు, లీవులు, సర్వీస్ పే, కార్మికుల కుటుంబానికి ఉచిత వైద్య సౌకర్యం, అలవెన్సులు, ప్రమాదంలో కార్మికుడు చనిపోతే కుటుంబానికి నష్టపరిహారం అమలు చేయడం లేదని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | సెప్టెంబర్ 22, 2023 | www.navatelangana.com

వైద్య శిబిరానికి విశేష స్పందన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని శంకర్‌గూడలో ఆల్ హాజీ మసూమ్ అలీ ట్రస్ట్ బీబీ క్యాన్సర్ హాస్పిటల్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మంది ఓపీలకు పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అవసరమైన వారికి రిమ్స్‌కు రేఫర్ చేశారు. ఈ శిబిరాన్ని దుబ్బగూడ, దనోర(కె), తదితర గ్రామాల ప్రజలు వినియోగించుకున్నారు. ఈ వైద్యశిబిరంలో డా.బేగ్, కే.భీముడు, ఫహీముల్ల, సర్పంచ్ తుమ్రం లక్ష్మణ్, ఉపసర్పంచ్ సుధీర్, హెచ్‌ఎ.వినోద్ పాల్గొన్నారు.



కలెక్టర్ ఆకస్మిక పర్యటన

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు జాబితాలోని మార్పులు చేర్పులకు సంబంధించి తుది కసరత్తు జరుగుతున్నందున అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. రైతుబంధు డబ్బులు సక్రమంగా రైతుల ఖాతాల్లో జమ అవుతున్నదీ లేనిది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీఓ శేఖర్, వ్యవసాయాధికారి మంగ్లారపు ప్రవీణ్ కుమార్, డిప్యూటీ తహసీల్దారు వి.గంగాధర్, ఆర్ఐలు దేవికా, శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది వెంకటేశ్, కిరణ్, సతీష్ ఉన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను సాధిద్దాం

• మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్



నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ ఉద్యమకారుడు, రాజకీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల స్ఫూర్తి ప్రధాత, స్వరాష్ట్రం కోసం పరితపించిన తెలంగాణ వాది మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. 11వ వర్ధంతి పురస్కరించుకొని పద్మశాలి సంఘ సభ్యులతో కలిసి గురువారం పట్టణంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 1945లో న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పోషించిన పాత్ర మరువలేనిదని గుర్తు చేశారు. 1969లో తొలిదశ పోరాటంలోనే కీలక పాత్ర పోషించి, మంత్రి పదవిని త్యజించిన త్యాగశీలి అని కొనియాడారు. ఉమ్మడి రాష్ట్ర పాలనలో తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రజలను చైతన్యం చేసి, తన గొంతుని వినిపించారని అన్నారు. తెలంగాణ పోరాటంలో అరెస్ట్ అయిన వారి పక్షాన ఉచితంగా వాదించరాని తెలిపారు. మూడు దశల ఉద్యమాలకు ఊపిరిలూది, విశాలాంధ్రను తీవ్రంగా వ్యతిరేకించి, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించారన్నారు.

నిజాం నవాబు నిరంకుశ పాలనపై అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. బాపూజీ ఆశయాలకు అనుగుణంగానే నేడు సీఎం కేసీఆర్ పాలన కొనసాగిస్తున్నారని వెల్లడించారు. జిల్లా కేంద్రంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కృషి, సహకారంతో స్వాతంత్ర్య సమరయోధుల, తెలంగాణ ఉద్యమకారుల, పలువురు ప్రముఖుల విగ్రహాలను నెలకొల్పుకోవటం జరిగిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు చిలుక రమణ, ప్రధాన కార్యదర్శి అల్లం అశోక్, పట్టణ ప్రధాన కార్యదర్శి బిట్ల నర్సయ్య, అడెపు భూమన్న, కుర్ర నరేష్, మెరుగు పవన్, భానుచందర్, నరహరి, కిషన్, టి.గురు, సబ్బని శ్రీనివాస్, వేముల కిషన్, ఏనుగందుల రవికుమార్, పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బాసర : మండల కేంద్రంలోని పద్మశాలి సంఘ భవనంలో గురువారం స్వర్గీయ మాజీ మంత్రి కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి వేడుకలను పద్మశాలి సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు స్వామి, రాష్ట్ర కార్యదర్శి కే.గంగాధర్, మాజీ ఎంపీటీసీ శ్యాంసుందర్, లక్ష్మణ్, రమేష్, మేకల అశోక్, గణేష్, సందీప్, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

జాతీయ కమిటీకి ఎన్నికైన జిల్లా ఆదివాసీ యువ నాయకుడు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత మూడు రోజుల పాటు ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ 4వ మహాసభలను తమిళనాడు రాష్ట్రంలోని నమక్కల్ పట్టణంలో నిర్వహించారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల నుంచి దాదాపు 400 మంది ఆదివాసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహాసభలలో దేశవ్యాప్తంగా ఉన్న ఆదివాసీ సమస్యలను చర్చించి, వాటిపై పలుపోరాటాల రూపకల్పన చేసి జాతీయ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఆదిలాబాద్ జిల్లా ఆదివాసీ యవ నాయకుడు పూసం సచిన్‌ను ఎన్నుకున్నారు. దీంతో పలువురు ఆయనను అభినందించారు.

ప్రభుత్వం అంగన్‌వాడీ జేఏసీతో చర్చలు జరపాలి

• సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ • వర్షంలో తడుస్తూ అంగన్‌వాడీల నిరసన





నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గత 11 రోజులుగా అంగన్‌వాడీలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తుంటే ప్రభుత్వం స్పందించకపోవడం జేఏసీ నాయకత్వంతో చర్చలు జరుపకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదురుగా చేపడుతున్న సమ్మె కొనసాగగా గురువారంతో 11వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం జేఏసీ నాయకత్వంతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి చొరవచూపాలని డిమాండ్ చేశారు. 11వ రోజు వర్షాన్ని సైతం లెక్కజేయకుండా అన్నీ మండలాల్లో జిల్లా కేంద్రం కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు సమ్మె పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరపాలని లేని పక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.సునీత, నాయకులు మధునిక, కవిత, కళావతి, శోభా, ప్రమీల, మంజుల, రాధా, కిష్టమ్మ ఉన్నారు.

సిరికొండ : అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ పలువురు అంగన్‌వాడీ టీచర్లు గత పదకొండు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమని పలువురు అంగన్‌వాడీ టీచర్లు అన్నారు. గురువారం వర్షంలోను సమ్మె చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు చాలిచాలని వేతనాలతో వెట్టి చాకిరీ చేస్తున్నారని అన్నారు. అనేక పోరాటాల వల్లనే రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాసర : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన నిరసన సమ్మె గురువారంతో 11వ రోజుకు చేరుకుంది. తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉదయం నుంచి కురుస్తున్న వర్షంలోను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు వర్షంలో తడుస్తూ గొడుగులు పట్టుకొని తమ నిరసనను వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. బాలింతలు, చిన్నారులకు పౌష్టిక ఆహారం అందక అవస్థలు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరవధిక సమ్మెలో సీఐటీయూ మండల అధ్యక్షురాలు రజియా, ప్రేమలత అరుణ, అనురాధ, లక్ష్మి, సరోజ, సభిన, రాజవ్వ, రాజమణి పాల్గొన్నారు.

నిర్మల్ : చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ రాజమణి అన్నారు. గురువారం వర్షం కురువడంతో సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు గొడుగులు పట్టుకొని వర్షాన్ని లెక్కచేయకుండా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని అన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, జిల్లా నాయకులు హేమలత, నర్సమ్మ, దేవిక, లావణ్య, రమ్య రమ, సుగుణ, జయశ్రీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



తలమడుగు : రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు పలు డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె గురువారంతో 11వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో భారీ వర్షంలోను అంగన్‌వాడీలు గొడుగులు పట్టుకొని సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11వ రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్‌వాడీల సమస్యలు తీర్చడంలో ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరిస్తోందని అన్నారు. అంగన్‌వాడీలందరూ చాలీచాలని వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నప్పటికీ, ప్రభుత్వ మొండి వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. నిత్యవసర ధరలకు అనుకూలంగా వేతనాలతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్నామని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెలో సీఐటీయూ నాయకులు లింగాల చిన్నన్నతో పాటు అంగన్‌వాడీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నార్నూర్ : ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గురువారం నిరవధిక సమ్మెలో భాగంగా గొడుగు పట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 46 సంవత్సరాలుగా ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ సేవలందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యం కల్పించాలన్నారు. సమ్మెలో వివిధ గ్రామాల అంగన్‌వాడీలు జాదవ్ పంచశీల, పంచపూల, రాథోడ్ సావిత్రి, రాథోడ్ స్యామక, పంచుబాయి, చాయ, మాయ, రత్న, మీరాబాయి, సునీత ఉన్నారు.

ప్రజల సహకారంతోనే వందశాతం పన్ను వసూలు



నవతెలంగాణ-బోథ్

మండలంలోని పిప్పల్‌ధరి గ్రామపంచాయతీలోని గ్రామస్తుల సహకారంతోనే పన్ను వసూలులో వంద శాతం పూర్తి చేశామని సర్పంచ్ బండారు శ్రీధర్‌రెడ్డి అన్నారు. గురువారం తమ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన పన్ను వసూలు కార్యక్రమంలో ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా వచ్చి ఇంటి పన్నులు కట్టడం జరిగిందని అన్నారు. పై అధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే వంద శాతం ఇంటి పన్ను వసూలు చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసి మొదటి గ్రామంగా పిప్పల్‌ధరి నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమాలపై కార్యదర్శి కే.రాజేశ్వర్ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు.

అత్యావసర సమయంలో రక్తదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ కాలనీకి చెందిన మోహన్‌రెడ్డి రిమ్స్‌లో గత కొన్నిరోజులుగా చికిత్స పొందుతున్నారు. గురువారం చికిత్స నిమిత్తం వైద్యులు బి పాజిటివ్ రక్తం అత్యవసరంగా అవసరమని సూచించంచడంతో కుటుంబీకులు యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డిని సంప్రదించారు. ఈ విషయమై న్యూహౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన చింతలపల్లి అరుణ్‌రెడ్డి ముందుకొచ్చారు. అత్యవసర సమయంలో బాధితుడికి రక్తదానం చేసి ఉదారతను చాటుకున్నారు. దీంతో కుటుంబీకులు రూపేష్ రెడ్డికి, అరుణ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వారితో పాటు యువ నాయకుడు ఫైయిమ్ ఉన్నారు.

పోలీసులపై జరిగిన ఘటనపై సీఐటీయూ విచారం

• పోరాటం ప్రభుత్వం మీద.. పోలీసులపై కాదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీల పోరాటం ప్రభుత్వం మీదని, పోలీసుల మీద కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం తాము చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిలో మహిళా ఎస్సై పట్ల జరిగిన సంఘటన దురదృష్టకరమని తెలియజేశారు. హఠాత్తుగా జరిగిపోయిన పరిణామమని తెలిపారు. పోలీస్ వ్యవస్థపై గౌరవం ఉన్న సంఘం అంగన్‌వాడీ యూనియన్ అయినప్పటికీ ఈ ఘటన జరగటం బాధాకరమని తెలియజేశారు. సంఘటనపై విచారం వ్యక్తం చేస్తున్నట్టు ప్రకటించారు. అంగన్‌వాడీల మీద జరిగిన హింసకు తగిన ప్రచారం రాలేదన్నారు. చాలా మంది అంగన్‌వాడీలకు దెబ్బలు తగిలాయని, స్పృహ కోల్పోయారని తెలిపారు. అంగన్‌వాడీలు పోరాడుతున్నది ప్రభుత్వంపైన అంతేకాని పోలీసులపై కాదన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. సీఐటీయూ నాయకులు రెచ్చగొట్టడం వల్లనే ఈ ఘటన జరిగినట్టు జరుగుతున్న ప్రచారం సరైనది కాదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు అనేకపోరాటాలు నిర్వహించిన చరిత్ర సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్లకు ఉందని తెలిపారు. ఏనాడూ ఇటువంటి ఘటనలు జరగలేదన్న విషయం అందరికీ తెలుసని ఈ విషయాన్నీ ప్రజలు, మేధావులు, గమనించాలని కోరారు. న్యాయమైన అంగన్‌వాడీల పోరాటానికి మద్దతునివ్వాలని పేర్కొన్నారు.

పురుగులమందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

తలమడుగు : పురుగులమందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నందిగామ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఏఎస్సై సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం... నందిగామ గ్రామానికి చెందిన సెడ్మకి భీంరావు(59) మద్యానికి బానిసై గురువారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి ఇద్దరు భార్యలు కాగా, ఇద్దరి భార్యలకు ఒక్కొక్క కూతురు ఉండగా మద్యానికి బానిసై ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

తాత్కాలికంగా సమ్మె విరమించిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు

• స్పష్టమైన హామీ రాకపోతే తిరిగి సమ్మెలోకి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమను రెగ్యులర్ చేయాలని తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేపడుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు తాత్కాలికంగా తమ సమ్మెను విరమించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 24 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు వివిధ రూపాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. ఐతే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ ఎస్పీడీ, దేవసేనలు సమగ్ర శిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ పరిష్కారం చేస్తామని హామీనిచ్చారు. ఈ నేపథ్యంలో వారి ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారిని ప్రణీత సమ్మె శిబిరానికి వచ్చి ఉద్యోగులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చి విధుల్లో చేరాలని కోరారు.

దీంతో సమ్మెను 48 గంటల పాటు తాత్కాలిక విరమణ చేస్తున్నట్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి రవీందర్ ప్రకటించారు. ప్రభుత్వ నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తాత్కాలిక విరమణ చేయడం జరిగిందని, ఒకవేళ స్పష్టమైన హామీ రాకపోతే తిరిగి సమ్మె కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్, వెంకటి, ధరంసింగ్, సలీం, వెంకన్న, వినోద్, పార్థసారథి, రేణుక, సోమన్న రాకేష్, నాయకులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-సిరికొండ

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, మధ్యాహ్న భోజన కార్మికురాలు బొడ్డు ఉమా అన్నారు. గురువారం సమ్మెకు సహకరించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కార్మికుల కోసం పెంచిన వేతనాలను ఇవ్వకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందర సమ్మె చేస్తున్నామని అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా చార్జీలను ఇవ్వాలని అన్నారు. గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు అబ్బెన లక్ష్మిలు పాల్గొన్నారు.



ఖేలో ఇండియా పోటీల్లో ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు చెందిన క్రీడాకారులు ఖేలో ఇండియా ఉమెన్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో రజత, కాంస్య పతకాలతో విజేతలుగా నిలిచారు. గురువారం హన్మకొండలో ట్రిపుల్ జంప్ పోటీలో వసంత సిల్వర్ మెడల్ సాధించగా, మూడువేల మీటర్ల పరుగు పందెంలో మనిషా కాంస్య పతకంతో నిలిచిందని కోచ్ రాకేష్ తెలియజేశారు. వీరి వెంట శిక్షకులు రాహుల్, రజిని ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని ధర్నా



నవతెలంగాణ-బోథ్

పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని గురువారం మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. లేనియెడల త్వరోనే భారీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కారం రవి, అశోక్, నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

శుక్రవారం | సెప్టెంబర్ 22, 2023 | www.navatelangana.com

దాతృత్వం చాటుకున్న ఎస్సై సందీప్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని అనాథాశ్రమంకు తాగునీటిని శుద్ధి చేసే యంత్రం అందించి టాస్క్ ఫోర్స్ ఎస్సై సందీప్ తన దాతృత్వాన్ని చాటుకున్నారు. సామాజిక కార్యకర్త మాడిశెట్టి ప్రశాంత్ చేసిన విన్నపం మేరకు ఎస్సై సందీప్ శుద్ధి చేసే యంత్రాన్ని అందజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రతీ రోజు ఎంతో బిజీగా ఉన్నప్పటికీ సామాజిక సేవ చేయడంలో సంతృప్తి ఇస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు సామాజిక సేవ చేసే భావనను కలిగి ఉండాలని అన్నారు. అనంతరం సామాజిక కార్యకర్త మాడిశెట్టి ప్రశాంత్ మాట్లాడుతూ పుట్టిన రోజు పెళ్లి రోజు వేడుకలకు ఎన్నో అనవసర ఖర్చులు పెట్టే బదులు సామాజిక చేవ చేసి ఆత్మ సంతృప్తి పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సతీమణి తోపాటు పలువురు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల ఆర్థిక సాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఫోటోగ్రాఫర్ ముత్యాల రవి కూతురు రమ్య ఎంసెట్‌లో మంచి ర్యాంక్ సాధించినా ఇంజనీరింగ్ విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో కాగజ్‌నగర్ ఫోటో, వీడియోగ్రాఫర్ల అసోషియేషన్ చేయూతగా నిలిచి ఆర్థిక సాయం అందించింది. అసోషియేషన్ సభ్యులంతా కలిసి జమ చేసిన డబ్బులను గురువారం రమ్యకు అందించి ఆమె హైదరాబాద్‌కు వెళ్లి కళాశాలలో చేరేందుకు తోడ్పాటునందించారు. రాబోయే రోజులలో మరింత ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా అసోషియేషన్ తెలిపారు.



డీఐఈఓగా నైతం శంకర్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

డీఐఈఓగా రెబ్బెన కళాశాల ప్రిన్సిపాల్ నైతం శంకర్ జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్మీడియట్ దశలో విద్యాభివృద్ధికి కషి చేస్తానని అన్నారు. అంతకుముందు ఇప్పటివరకు పని చేసిన డిఐఈఓ శ్రీధర్ సుమన్ శంకర్‌కు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలల ప్రిన్సిపల్ రాందాస్, లక్ష్మణరావు, అమరేందర్ పాల్గొన్నారు

టీజీజెఎల్ఏ ఆధ్వర్యంలో సన్మానం

నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి శంకర్‌ను తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకుడు నాయిని శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నవీన్‌రెడ్డి ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ సునీల్, జిల్లా నాయకులు శ్రీనివాస్, సంతోష్, వినోద్, వేణు, ఆత్మారాం, సరిత, రజిత, హరిదాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి తెలంగాణ రత్న పురస్కారం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాకు చెందిన ఉపాధ్యాయునికి ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రత్న పురస్కారం సొంతమైంది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని వాంకిడి మండలం సరండి ఎంపీపీఎస్‌లో ఎస్జీటిగా విధులు నిర్వహిస్తున్న నూతి అభిలాష్ ప్రపంచంలోనే అత్యధిక కోర్సులు పూర్తిచేసి రికార్డు సృష్టించిన నేపథ్యంలో హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అఖిల భారత తెలుగు సమాఖ్య, ఏపీ స్టేట్ కల్చరల్ అసోసియేషన్, అర్పిత సాహిత్య సాంస్కృతిక స్వచంద సేవా సంస్థ నిర్వహించిన ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవంలో ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రత్న అవార్డు రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి చైర్మన్ మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలచారి రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహనరావు విశ్రాంత ఐఏఎస్ లక్ష్మీకాంతం నవల రచయిత్రి కేవీ.కృష్ణ కుమార్ సంఖ్య శాస్త్రజ్ఞుడు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రతి ఒక్కరు గర్వించదగ్గ స్థాయికి అభిలాష్ చేరుకున్నాడని తెలిపారు. ఈ సందర్భంగా అభిలాష్ మాట్లాడుతూ చదువు మీద ఇష్టంతో విద్యా విభాగంలో 95 కోర్సులు పూర్తి చేశానని తెలిపారు. ఈ ఘనత సాధించడానికి అనేక మంది తనకు సహకరించారని తెలిపారు. తాను ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న జిల్లా నుండి ఎంతో సహకారం లభించిందని తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ హామీతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె విరమణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా గత 24 రోజుల నుంచి చేస్తున్న సమ్మె గురువారం విరమించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో రాష్ట్ర నాయకులు చేపట్టిన చర్చలలో డిమాండ్ పరిష్కారానికి హామీ ఇవ్వడంతో జిల్లాలో సంఘం నాయకులు సమ్మె విరమించి జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఆశభావం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకొని పక్షంలో మరోసారి సమ్మెలోకి వెళ్ళనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, రాజేష్, సతీష్, కేజీబీవీ సీఆర్టీలు సురేఖ రాథోడ్, నాన్ టీచింగ్ సిబ్బంది భవాని, తిరుమల, మమత పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్ ఎన్నికల స్ట్రాటజీ కమిటీ చైర్మన్ ఉమ్మడి జిల్లా మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని గణేష్ రాథోడ్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండీ నిజాం, గడ్డల సత్తయ్య, మేకర్తి కాశయ్య, ఎస్.కె.ఇస్మాయిల్, శేఖర్, కొయ్యల మొండి, ఫర్హాన్ హుస్సేన్, చిన్న, గౌతమ్, నరేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్ సబ్ స్టేషన్‌లో 132 కెవి మరమ్మత్తుల నేపథ్యంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డిఈ ప్రసాద్, ఏడిఈ శ్రీనివాస్ లు ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుండి 2 గంటల వరకు ఆసిఫాబాద్ పట్టణంతో పాటు ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి మండలాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారుల సహకరించాలని పేర్కొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ దసరా కానుక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ ప్రయాణికులకు టీఎస్‌ఆర్టీసీ దసరా ఆఫర్ ఇస్తుందని డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్టోబర్ 15 నుంచి అక్టోబర్ 29 మధ్య ప్రయాణించే ప్రయాణికులు ఈ నెల 22, 30వ తేదీలలో ఓపీఆర్ఎస్‌లో ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు తిరుగు ప్రయాణంపై కేటాయించే టికెట్‌పై 10శాతం రాయితీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ బస్ టికెట్ల కొరకు టీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్‌లో కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో జిల్లాలోని వివిధ మండలాల నుండి 50 మంది విద్యార్థులు హాజరయ్యారు. అండర్-14, 17 విభాగాలలో బాలురు, బాలికలకు ఈ పోటీలు నిర్వహించారు. అనంతరం జిల్లా స్థాయి పోటీలకు టీంను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సాంబశివరావు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కృష్ణప్రసాద్, కరాటే మాస్టర్ దేవయ్య పాల్గొన్నారు.

కలెక్టరేట్ ముట్టడి ఉద్రిక్తం

- అంగన్‌వాడీలకు పోలీసులకు మధ్య తోపులాట
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా నిరసనలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మధు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో పోలీసులకు అంగన్‌వాడీలకు మధ్య తోపులాట జరిగింది. ముందస్తు పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున తరలివాచ్చారు. దీంతో పోలీసులు భారీగా మొహరించారు. అంగన్‌వాడీలను బయాందోళనకు గురి చేసినప్పటికీ వెనుకాడకుండా ముట్టడిని కొనసాగించారు. దీంతో అంగన్‌వాడీలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం జరిగి తోపులాట దారి తీసింది. పెద్దపెట్టున నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. సీఐటీయూ నాయకులను పోలీసులు ఈడ్చుకెళ్లటంతో ఆందోళన మరింత తీవ్రతరం అయింది. పలువురిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.



వర్షాన్ని సైతం లెక్క చేయకుండా కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు

గేట్లు పైకెక్కిన అంగన్వాడీలు

కలెక్టరేట్‌కు పెద్ద ఎత్తున అంగన్‌వాడీలు చేరుకోవడంతో పోలీసులు కలెక్టరేట్ గేట్లు మూసివేశారు. దీవతో ఆగ్రహం వ్యక్తం చేసిన అంగన్‌వాడీలు గేట్లను తోసే ప్రయత్నంలో భాగంగా పైకెక్కారు. పోలీసులు వారించడానికి ప్రయత్నం చేసినప్పటికీ వారు పోలీసులను ఎదిరించి లోపలికి చొచ్చుకు వెళ్లారు. పోలీసు ఆందోళన కారులను చెదరగొట్టి సీఐటీయూ నాయకులను అరెస్టు చేశారు.





కలెక్టరేట్ ఎదుట భారీగా మోహరించిన పోలీసులు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదు

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేది లేదని సీఐటీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి మధు హెచ్చరించారు. కలెక్టరేట్ ముట్టడిలో భాగంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన తర్వాత ఆయన మాట్లాడుతూ అరెస్టులు ఉద్యమాన్ని ఆపలేవని అన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజేందర్, ముంజం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఓదెలు, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కమిటీ సభ్యుడు కృష్ణమాచారి, వనిత, అంజలి పాల్గొన్నారు.

వర్షంలోనూ తగ్గని పోరు

ఓవైపు భారీ వర్షం మరోవైపు ఉద్యోగ భద్రత కోసం ఆరాటం. ఈ రెండింటి మధ్య అంగన్‌వాడీలు చేసిన పోరాటానికి వర్షం చిన్నబోయింది. దాదాపు రెండు గంటల పాటు భారీ వర్షంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. వర్షంతో ముట్టడి పై కొంత అనుమానం తలెత్తినప్పటికీ అనుకున్న దానికంటే ఎక్కువ మొత్తంలో అంగన్‌వాడీలు హాజరు కావడంతో కలెక్టరేట్ ప్రాంగణం నినాదాలతో మార్మోగింది.



కలెక్టరేట్ గేట్‌పైకి ఎక్కిన అంగన్వాడీలు

మెడికల్ కళాశాలకు కొండా లక్ష్మణ్ పేరు పెట్టాలి

- పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు
- ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ పోరాటంలో అధ్యుడు జిల్లాకు చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును మెడికల్ కళాశాలకు పెట్టాలని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుకుల ఆంజనేయులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవనంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 11 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు చెందిన గొప్ప నాయకుడు తెలంగాణ ఉద్యమంలో ఆధ్యుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. జిల్లా కేంద్రంలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వరాష్ట్ర సాధనలో ఆయన కృషి ఎంతగానో ఉందని జిల్లా నాయకులు దానికనుగుణంగా జిల్లా కేంద్రంలో విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోమటిపల్లి లింగయ్య, భవన ఋషి, వనమల ధర్మయ్య, తెలివార్ మోహన్, హనుమండ్ల శ్రీకాంత్, జంజీరాల సంజీవ్, హనుమండ్ల ప్రవీణ్, వనం మధుకర్, గాజర్ల శైలేందర్, జంజీరాల శ్రీనివాస్, రాంపల్లి సత్యనారాయణ, ఆవిడపు ప్రణయ్, రుద్ర వేణుగోపాల్, ఇరుకుల్ల మంగ, ఇరుకుల్ల పుష్పలత, చెన్నూరి సునీత, రాంపల్లి విజయ పాల్గొన్నారు.



పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతి



కాగజ్‌నగర్ : కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి

కాగజ్‌నగర్ : స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని గురువారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వర్ధంతి వేడుకలో ముందుగా బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కుడిక్యాల రాజమౌళి, ప్రధాన కార్యదర్శి కేదారి, టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్, సంఘం నాయకులు నల్ల కనకయ్య, సామల రాజన్న, జి మల్లయ్య, జి నాగేశ్వర్‌రావు, బోగ సత్యనారాయణ, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలో గురువారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని లక్ష్మణ్ సేవా సదన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మణ్ సేవా సదన్ అధ్యక్షుడు గాదె అవినాష్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అశోక్ మౌల్కార్, సంస్థ కార్యవర్గ సభ్యుడు బంక రోహిదాస్, మడావి రాందర్, శ్రీరాం, దిలీప్, స్రావన్, వడాయి తిరుపతి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. గురువారం అధికారులతో జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసే విధంగా అధికారులు కృషి చేయాలని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమంలో జిల్లాలో మొదటి విడతలో ఎంపికైన పాఠశాలలలో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు తరగతి గదులు, మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర ఎంపిక చేయబడిన పనులతో పాటు మరమ్మత్తు పనులు, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. జిల్లాలో మంజూరైన గ్రామపంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు మంజూరైన భవనాల పనులను త్వరగా ప్రారంభించి పూర్తిచేసేలా అవసరమైన కార్యచరణ రూపొందించుకోవాలని తెలిపారు. జిల్లాలో మంజూరైన రహదారులు, వంతెనలు, కల్వర్టులు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. తెలంగాణకు హరితహారం కింద జిల్లాకు కేటాయించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, మండలాల వారీగా కొనసాగుతున్న పనులపై పర్యవేక్షించాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా విద్యాధికారి అశోక్, పంచాయతీ అధికారి సురేందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అంతర్జాతీయ లాయర్స్ కాన్ఫరెన్స్‌కి జిల్లా లాయర్లు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 23, 24 తేదీల్లో ఢిల్లీలో జరిగే అంతర్జాతీయ లాయర్స్ కాన్ఫరెన్స్ 2023కు జిల్లా లాయర్లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కాన్ఫరెన్స్‌కు ఎంపికైన బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, ప్రధాన కార్యదర్శి రాపర్తి రవి మాట్లాడుతూ ప్రధాని అధ్యక్షతన జరిగే కాన్ఫరెన్స్‌కు తాము ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు. జిల్లాలోని అడ్వకేట్‌ల సమస్యలపై చర్చించే మంచి వేదిక అభించిందన్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల న్యాయనిపుణులు జడ్జీలు అడ్వకేట్లు ఈ కాన్ఫరెన్స్‌కు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జగన్ మోహనరావు పాల్గొన్నారు.

రుణమాఫీ అర్హత కలిగిన ప్రతి రైతుకు అందాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అర్హత కలిగిన ప్రతి రైతుకు రైతు రుణమాఫీ అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. గురువారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి వ్యవసాయ, విస్తరణ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో ప్రభుత్వం చేపట్టిన రూ.లక్ష రూపాయల లోపు రుణమాఫీ పథకం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీలో భాగంగా అర్హత గల రైతుల ఖాతాలలో నిధులు జమ చేయడం జరిగిందని, రైతుల ఖాతాలను చేసి రుణమాఫీని రైతుల ఖాతాలలో జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ అధికారుల సమన్వయంతో రైతులకు మేలు జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో సి కేటగిరి కింద 198 మంది రైతుల ఖాతాలు ఉన్నాయని, ఆధార్ కార్డు అనుసంధానం చేసి రైతుబంధు ఖాతాల ప్రకారం రైతుల వివరాలు సేకరించి వారికి కూడా రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నెల 25వ తేదీలోగా ప్రక్రియ పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు రెన్యువల్ జరిగిన రైతుల ఖాతాలను పరిశీలించి రుణమాఫీ డబ్బుల జమపై పర్యవేక్షించాలని, గ్రామాల వారీగా రైతుల వివరాలతో జాబితా సిద్ధం చేసి అందించాలని పేర్కొన్నారు. జిల్లాలో జరిగిన రుణమాఫీ వివరాలతో నివేదిక రూపొందించి సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ హనుమంతరావు పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ సీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి డాక్టర్ డి.తుకారాం సూచించారు. గురువారం సాయంత్రం కాగజ్‌నగర్ సీహెచ్‌సీని పరిశీలించి అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీహెచ్‌సీకి వచ్చే రోగుల పట్ల కొంతమంది నిర్లక్షంగా వ్యవరించడం తమ దృష్టికి వచ్చిందన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు సరైన సేవలందించాలని సూచించారు. మాతృ మరణాలు, శిశు మరణాలు జరగకుండా ప్రాథమిక దశలోనే గర్భిణీ మహిళలకు రక్తహీనత లేకుండా పౌష్టిక ఆహారాన్ని అందించడం ఐరన్ అండ్ ఫోలిక్ యాసిడ్, క్యాల్షియం టాబ్లెట్లను అందించాలన్నారు. ఆరోగ్య కేంద్రాలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ సీతారాం, పీఓ ఎస్ సీడీ డాక్టర్ వినోద్, డాక్టర్ విజయ్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అనీసోద్దిన్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని రాస్తారోకో

నవతెలంగాణ-నస్పూర్

బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్ట భద్రత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం శ్రీరాంపూర్ బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి సుందిల్ల మల్లేష్ మాదిగ మాట్లాడుతు బీజేపీ పార్టీ అధికారంలోకి వచ్చాక 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తానని చెప్పి ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెట్టిన మింటిగ్‌కి బీజేపీ పెద్దలు, కేంద్ర మంత్రులు అనేక సందర్భాల్లో వర్గీకరణ బిల్లు చేస్తామని మాట్లాడటం జరిగిందన్నారు. నేటికి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్న మాట నిలుపుకోలేదని విమర్శించారు. ఈ ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ నేతలను మాదిగ పల్లెల్లో తిరగనియం అని రానున్న ఎన్నికల్లో ఓటుతో బీజేపీకి బుద్ధి చెబుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జలంపెల్లి శ్రీనివాస్ మాదిగ, పట్టణ అధ్యక్షులు గుంపుల స్వామి మాదిగ, ఎంఎస్పీ పట్టణ అధ్యక్షులు మెగిలి చంద్రయ్య మాదిగ, సినియర్ నాయకులు లింగంపెల్లి స్వామి మాదిగ, జైపూర్ మండల అధ్యక్షుడు రామగిరి రాము మాదిగ, ప్రధాన కార్యదర్శి నిట్టూరి ప్రశాంత్ మాదిగ, ఉపాధ్యక్షుడు తుంగపిండి సాయి మాదిగ పాల్గొన్నారు.

అనుమతులు లేని కట్టడాలపై స్పందించని కమిషనర్

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ఓవర్ బర్డెన్ తీయడానికి జీవీఆర్ కంపెనీ కాంట్రాక్ట్ తీసుకోవడం జరిగిందని, క్యాంప్ ఆఫీస్‌కు మున్సిపాలిటీ అనుమతులు లేకుండానే కట్టడాలు చేపట్టారని ఆమ్ ఆద్మీ పార్టీ మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాయిం పాషా పేర్కొన్నారు. అక్రమ కట్టడాలు చేపడుతున్నారని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన స్పందించడం లేదని ఆరోపించారు. జీవీఆర్ కంపెనీకి నాలుగు సంవత్సరాల టెండర్ ఇవ్వడం జరిగిందని, వారికి క్యాంప్ ఆఫీస్‌కు ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న స్థలాన్ని కేటాయించారని, అనుమతి లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. టీఎస్ బీ పాస్ ద్వారా మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసి పది రోజులు గడుస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ నోటీస్ తయారు చేసి నస్పూర్ మున్సిపల్ కమిషనర్‌కి ఇచ్చినప్పటికీ సంతకం పెట్టడానికి నిరాకరించారని తెలిసిందన్నారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు ఇవ్వడం జరిగిందని, కట్టడాల పైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కుస్తీ పోటీల్లో మదర్‌థెరిసా విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-దండేపల్లి



ఎస్జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి కుస్తీ పోటీల్లో మదర్ థెరిసా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 16న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కుస్తీ పోటీలలో పాఠశాలకు చెందిన అండర్-14 బాలికల విభాగంలో తాన్విశ్రీ, రిషిత, శ్రీజ, నైతిక ప్రతిభ కనబరచగా అండర్-17 విభాగంలో మనిష, శ్రేష్ఠ, అమూల్య, శ్రీనిధి, అండర్-14 బాలుర విభాగంలో సిద్ధార్థ, విశాల్ అండర్-17 బాలుర విభాగంలో యూనిస్ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు గొడిసెల రాజేశం తెలిపారు. ఈ సందర్భంగా వారిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ చెరువును ఆర్డీఓ సురేష్, ఏసీపీ సదయ్య, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, తహసీల్దార్ సుధాకర్ 1 టౌన్ ఇన్స్‌పెక్టర్ శంకరయ్య సందర్శించి గణేష్ నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. గణేష్ విగ్రహ నిమజ్జనం జరిగే బెల్లంపల్లి పోచమ్మ చెరువు ప్రదేశంలో క్రైన్స్, సానిటేషన్, లైటింగ్, ఇతర ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. గణేష్ నిమజ్జనం నాటికి అన్ని శాఖ సహకారంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గణేష్ మండల కమిటీలు నిమజ్జనం శాంతియుతంగా జరిగేలా సహకరించాలని కోరారు

విడుదలైన ఏరియర్స్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-మందమర్రి

అత్యధిక ఏరియర్స్ పొందిన ఉద్యోగులకు జీఎం మనోహర్ గురువారం చెక్కులను అందజేశారు. మందమర్రి ఏరియా జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్సిడబ్ల్యూఏ-11వ వేజ్ బోర్డులో అత్యధిక ఏరియర్స్ వచ్చిన ఉద్యోగులు ఎన్ మోహన్‌రెడ్డి కెౕ-5 ఎలక్ట్రీసియన్, గోపతి రామ్ చందర్, కెౕ-5 కోల్ కట్టర్, జోగుల కొమరయ్య కెౕ హెడ్ ఓవర్ మాన్‌లకి ఏరియా జీఎం చెక్కులను అందజేశారు. ఏరియర్స్ పొందిన ఉద్యోగులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంపాదించిన డబ్బులను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. సిఎంపిఎఫ్ పెన్షన్, ఇన్కమ్ టాక్స్ మొదలగు మినహాయింపులు చట్టబద్ధమైనవని కావున ఈ మినహాయింపులు ప్రతినెల ఉద్యోగి జీతంలో కూడా ఉండే మినహాయింపులుగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ శైలేంద్ర సత్యనారాయణ, యూనియన్ నాయకులు, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, సీఎంఓఏఐ అధ్యక్షులు పైడిశ్వర్, సంక్షేమాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీ,ఎస్సీ,ఎస్టీల మహిళలకు 93 శాతం వాటా కేటాయించాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ, ఎస్సి, ఎస్టీల మహిళలకు 93 శాతం వాటా కెటాయించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం మహిళా రిజర్వేషన్ బిల్లు దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రచార కమిటీ నాయకులు మాట్లాడుతూ అణగారిన వర్గాల మహిళలకు ఉప కోట కేటాయించకపోతే అగ్రవర్ణ దొరల పాలన పోయి దొర సానులు పార్లమెంటు అసెంబ్లీలోకి ప్రవేశిస్తారని అన్నారు. దీనివల్ల బీసీ,ఎస్సీ,ఎస్టీ మహిళలకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందకూడదని, 93 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఉపకోట 93 శాతం కల్పిస్తె ధర్మ సామాజ్ పార్టీ బిల్లుకు మద్దతు తెలుపుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ప్రచార కమిటీనాయకులు జంగపెల్లి రామస్వామి, నందిపాటి రాజు, రేగుంట రాకేష్, మేడి రాజు పాల్గొనారు.

పశు దాన పంపిణీ



నవతెలంగాణ-భీమారం

గొల్లకుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీతో వారిని ప్రోత్సహిస్తోందని జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం చైర్మన్ కొమ్ము అశోక్ యాదవ్ తెలిపారు. గురువారం మండల పశువైద్య అధికారి డాక్టర్ రాకేష్ శర్మ ఆధ్వర్యంలో పశు దానా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖాజీపల్లి గ్రామానికి చెందిన పలువురు రెండో విడత లబ్ధిదారులకు పశు దానా పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఒక్కో యూనిట్‌కు 2 యాభై కేజీల దానా బస్తాలను ఉచితంగా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గొర్రె మేకల పెంపక వత్తిదారుల సంఘం చెన్నూర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మెండె మల్లేష్ యాదవ్, రైతులు చేలుకల తిరుపతి యాదవ్, చెగొండ ఓదెలు యాదవ్, ఎర్ర మొండి, చేలుకల ఐలయ్య యాదవ్, మేకల రాజబాబు యాదవ్, మోతుకు శంకరయ్య పాల్గొన్నారు.

డీజే నిర్వాహకుల బైండోవర్



నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో డీజే సౌండ్స్‌ను ఉపయోగిస్తూ ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తున్న ఐదుగురు డీజే నిర్వాహకులను అరెస్టు చేసి తహసీల్దార్ సుధాకర్ ముందు బైండోవర్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ శంకరయ్య తెలిపారు. బెల్లంపల్లి వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ పండుగలకు, పెండ్లిళ్లకు, ఊరేగింపులకు డీజే సౌండ్స్‌ను ఉపయోగిస్తూ ప్రజా శాంతికి, ధ్వని కాలుష్యానికి కారణమవుతున్నందున ముందస్తు చర్యలలో భాగంగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామని తెలిపారు. డీజే నిర్వాహకులను 6 నెలల కాల వ్యవధిలో మరల సౌండ్ పొల్యూషన్ నేరానికి పాల్పడితే బైండోవర్ ఉల్లంఘున నేరం కింద రెండు లక్షల రూపాయల జరిమానా లేదా జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలియజేసూస్తూ పూచీకత్తుపై వదిలిపెట్టినట్లు తెలిపారు.

ఘనంగా కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి

నవతెలంగాణ-దండేపల్లి

కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని గురువారం మండల కేంద్రంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు, పలు సంఘాల నాయకులు బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాపూజీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. తెలంగాణా ఉద్యమంలో కొండా లక్ష్మణ్ బాపూజీ పాత్ర మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు వడ్నాల శంకర్, నాయకులు బూర్ల వెంకటేశ్వర్లు, ఎనగందుల దేవేందర్, సత్యం, శ్రీనివాస్, సురేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

హాజీపూర్ : ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో గల పద్మశాలి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు చిలగాని సుదర్శన్, ఆవిడపు వెంకటేశం మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చెద్దామని పిలునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అంజయ్య, బండారి రాజేశం, గడ్డం రాములు, చిలాగాని శ్రీహరి, బండి మల్లిఖార్జున్ పాల్గొన్నారు

జన్నారం : కొండ లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని మండల కేంద్రంలో మండల పద్మశాలి కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించుకున్నారు, మండల అధ్యక్షుడు చేట్ పెల్లి గంగయ్య కొండ లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొండ లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాలిన మధు, శెట్టిపల్లి సత్యం, ఆడపు లక్ష్మీనారాయణ కృష్ణ, భాస్కర్, వీరయ్య, రమేష్ నరేందర్ సత్యం రాజన్న పాల్గొన్నారు.



దండేపల్లి

రామకృష్ణాపూర్ : పట్టణంలోని స్థానిక రాజీవ్ చౌరస్తాలో పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆచార్య కొండ లక్ష్మణ్ బాపూజీ 11వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షులు వనం సత్యనారాయణ మాట్లాడుతూ లక్ష్మణ్ బాపూజీ 1947-48 నిజాం నవాబుల రజాకార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన వ్యక్తని, 1969 తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడి తెలంగాణ సాయుధ పోరాటంలో కూడా ప్రముఖ పాత్ర పోషించినటువంటి మహానుబావుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.



హాజీపూర్



జన్నారం

పంచాయతీల అభివద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-తాండూర్

పంచాయితీలను అభివృద్ధి పరిచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని విదాల కృషి చేస్తోందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి మండలంలోని లంబడితండా, మాలగురుజాల పంచాయతీలలో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయితీలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో ప్రభుత్వ పనిచేస్తోందన్నారు. అందుకు గాను గ్రామపంచాయతీలలో మౌలిక వాసతుల కల్పన కు ప్రభుత్వం నిధులను కేటాయిస్తున్నట్లు గుర్తు చేశారు. పంచాయితీల పునర్విభజన తర్వాత పంచాయితీలు అంచలంచలుగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఇప్పటికే పంచాయతీల్లోస్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. పంచాయతీ భవనాల నిర్మాణం సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. పంచాయితీ భవనాల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని సూచించారు. లంబడితండాలో రూ.ఐదు లక్షలు, గురిజాల గ్రామపంచాయతీలో రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. గురజాల పంచాయతీలో పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ తతొంగల సత్యనారాయణ, ఎంపీపీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రాణి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, ఎంపీటీసీ శకుంతల, కోఆప్షన్ సభ్యుడు పాషా, గురుజాల సర్పంచ్ రజిత పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరగాలి

- మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్
- గూడెం గోదావరి నది వద్ద ఏర్పాట్ల పరిశీలన

నవతెలంగాణ-దండేపల్లి



వినాయకుడి నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్ సూచించారు. మండలంలోని గూడెం గోదావరి నది వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. గోదావరి నది వద్ద విగ్రహాల నిమజ్జనానికి కల్పించాల్సిన వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. వాహనాలు వచ్చే దారులన్నీ మరమ్మతులు చేయాలని, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని, పెద్ద విగ్రహాల నిమజ్జనానికి క్రేన్లు ఉపయోగించాలని ఆయన సూచించారు. నిమజ్జనం పూర్తయ్యేవరకు గజ ఈతగాళ్లు అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. అనంతరం డీసీపీ సుధీర్ రామ్ నాథ్ కేకన్ మాట్లాడుతూ నిమజ్జనం ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వినాయక నిమజ్జనాలు చేసే చెరువుల వద్దకు ఈతరాని వారు వెళ్లొద్దని, పిల్లల్ని వెళ్లనీయొద్దని సూచించారు. వినాయక నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక పోలీసు సిబ్బందికి సూచించారు. ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి చేసుకోవాలన్నారు. బాణాసంచా, మద్యం జోలికి వెళ్లకూడదన్నారు. మహిళలు, యువతులు, చిన్నారులను నిమజ్జనం జరిగే ప్రదేశాలకు తీసుకురాకూడదన్నారు. వారి వెంట స్థానిక సంస్థల అదన కలెక్టర్ రాహుల్, అడిషనల్ కలెక్టర్ మోతిలాల్, ఏసిపి తిరుపతిరెడ్డి, తహసీల్దార్ సంధ్యారాణి, లక్షెట్టిపేట, సీఐ కృష్ణ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా పీఎస్ఆర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-జన్నారం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు జన్మదిన వేడుకలను జన్నారం మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏనుగు సుభాష్‌రెడ్డి, గుర్రం మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ముసాఫర్ అలీ, పసియుల్లా, సతీష్‌రెడ్డి, దుమల రమేష్, ఇంద్రయ్య, మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, మహమ్మద్ అజారుద్దీన్, వాషిం పటేల్, షాకీర్, సుధాకర్ నాయక్, మాణిక్యం గంగన్న, పద్మారావు పాల్గొన్నారు.

తాండూర్ : ఎఐసీసీ సభ్యుడు మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యూహరచన కమిటీ చైర్మన్ కొక్కిరాల ప్రేమ్ సాగర్ 64వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా బెల్లంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నాతరీ స్వామి ఆధ్వర్యంలో స్థానిక వంద పడకల ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మండల అధ్యక్షులు బాకం మల్లేష్, పట్టణ మైనారిటీ అధ్యక్షులు గౌస్ బాయ్, కాంగ్రెస్ నాయకులు ఆడెపు మహేష్ , కనుకుంట్ల రాజేష్(న్యాయవాది), కృష్ణపల్లి మనోహర్ పాల్గొన్నారు.



ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు తెలంగాణ గ్రామీణ బ్యాంక్, ఇందనపల్లి తెలంగాణ గ్రామీణ బ్యాంకు శాఖల ఆధ్వర్యంలో కలమడుగులోని వివేకానంద ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. పొదుపు, ఇన్సూరెన్స్ లావాదేవీలపై అవగాహన కల్పించారు. మ్యాజిక్ షోతో పాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని బ్యాంకులో రైతులు, ప్రజల సేవ కోసమే ఉన్నాయని అన్నారు. రుణాలు తీసుకొని సకాలంలో చెల్లించాలని పంట రుణాలను కూడా సకాలంలో చెల్లించాలని కోరారు. ఇన్సూరెన్స్ ద్వారా ఎంత లబ్ధి ఉంటుందని బ్యాంకులో గ్యారంటీగా పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇందన్‌పల్లి శాఖ ఫీల్డ్ అధికారి మహేష్, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ గౌడ్ బ్యాంక్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో నర్సయ్య 29వ వర్ధంతి

నవతెలంగాణ-నస్పూర్

అమరజీవి పి.నర్సయ్య 29వ వర్ధంతి సందర్భంగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఆధ్వర్యంలో గురువారం శ్రీరాంపూర్‌లో సభ నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక పక్షపాతిగా అనేక హక్కులు సాధించిన నర్సయ్య ఎదుగుదలను ఓర్వలేని కొందరు కక్షగట్టి హత్య చేశారని తెలిపారు. నర్సయ్య లోటు ఎవరూ పూడ్చలేనిదన్నారు. మేజర్ గ్రామపంచాయతీ తాళ్లపల్లికి సర్పంచ్‌గా ప్రజలకు, సింగరేణి కార్మికులకు హక్కులు కల్పించిన నాయకుడని కొనియాడారు. 190 మస్టర్లు నిండిన కార్మికులకు ఈ రోజు ఇంక్రిమెంట్ వస్తుందంటే అది కేవలం నర్సయ్య కృషే అని గుర్తు చేశారు. భవిష్యత్తులో నర్సయ్య ఆశయాలను కొనసాగించడానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్మికుల తరపున పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దాసు, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్‌రావు, మోత్కూరి కొమురయ్య, సిపిఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఎస్.మల్లేష్, రాచర్ల చంద్రమోహన్, లింగం రవి, అఫ్రోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

మహిళా బిల్లు ఆమోదంతో సంబురాలు

నవతెలంగాణ-నస్పూర్

పార్లమెంట్‌లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లు ఆమోదం పొందడంతో మహిళలు గురువారం ఆనందంతో జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సేవా అధ్యక్షురాలు రాధాకుమారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు రాధా కుమారి-సంజీవరెడ్డి మాట్లాడుతూ చట్టసభలలో మహిళా బిల్లు ఆమోదం చాలా సంతోషకరమైన విషయమని, మహిళలు అన్ని రంగాలలో తమ తెలివితేటలు ప్రతిభా పాటవాలతో అన్ని పనులను దిగ్విజయంగా సాధిస్తున్నారని గుర్తు చేశారు. మహిళా బిల్లు ఆమోదం పొందటం అభినందించదగిన విషయమని, మహిళలు అందరూ అన్ని రంగాలలో ముందుకు వెళ్తున్నారని పార్లమెంట్‌లో మహిళలకు ప్రాధాన్యం లభించడం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కృషి ఫలితమేనని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం ఐఈడీ చిరంజీవులు, సీనియర్ పీఓ కాంతారావు, ఎస్టేట్స్ ఆఫీసర్స్ వరలక్ష్మి, స్వప్న, లా ఆఫీసర్ ప్రబంధిత, జనరల్ మేనేజర్ కార్యాలయ మహిళా ప్రతినిధి ఆకుల అఖిల, సేవ సెక్రటరీ కొట్టే జ్యోతి, సేవా సభ్యురాలు శారద, రజిత పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేస్తే అభివృద్ధి అంటారా..?

- బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్



నవతెలంగాణ-చెన్నూర్

అభివృద్ధి చేయడం అంటే ఊరి మధ్యలోని రోడ్డు వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ పెట్టించడమేనా అని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు తుంగపిండి రమేష్ అన్నారు. గురువారం పట్టణంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో పాల్గొని కార్యకర్తలతో మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని, కేవలం పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు వరకు రోడ్డు వెడల్పు చేసి లైటింగ్ ఏర్పాటు చేయడం మాత్రమే కనిపిస్తుందని అన్నారు. పట్టణ కేంద్రంలోని పలు వాడలలో ఇప్పటికి సరైన రోడ్డు, కాలువలు, మంచినీరు సౌకర్యాలు లేవని, మారేమ్మ వాడకు బస్టాండ్ నుంచి ఆటో వెళ్లలేని పరిస్థితిలో రోడ్లు ఉన్నాయని తెలిపారు. ఒక దళిత ఎమ్మెల్యే అయివుండి మండలంలోని బావురావ్‌పేట శివారులో భూమి లేని పేదల ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకోని, శాంతియుతంగా నిరసన తెలుపుతున్నవారిపై కొందరు దుండగులు దాడులు చేయగ ఇప్పటికి వారిని పట్టుకోని తగిన న్యాయం చేయలేక పోయారని వాపోయారు. ఎమ్మెల్యే అండదండలు వారికి వున్నాయనో తెలియదుకానీ వారికి న్యాయం చేయలేని స్థితిలో వున్నారా అని ప్రశ్నించారు. కనీసం వారిని పరామర్శించడం కూడా చేయలేకపోయారని ఒక దళిత ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు ఏమి చేయలేదని ఎద్దేవా చేశారు. అంతకుముందు పార్టీ మండలాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన తగరం వినయ్‌ని ఎన్నుకోని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సైదల శ్రీనివాస్, సినీయర్ నాయకులు చొప్పదండి అశోక్, డేగ మహేష్, జైపూర్ మండలాధ్యక్షుడు కన్నూరి కష్ణ , నాయకులు ఆదర్శ్, మోత కిరణ్ కుమార్ తదీతరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 22, 2023 | www.navatelangana.com

ప్రభుత్వ పరంగా అండగా ఉంటాం

నవతెలంగాణ - దహెగాం



మృతుల కుటుంబాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. గురువారం మండలంలోని గిరవెల్లి గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన రౌతు నవీన్(22) కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే చౌక గ్రామానికి చెందిన బాలుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం కమ్మరిపెల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు ముడిమడుగుల దాసు ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులను సైతం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా కుటుంబాలను అన్ని రకాలుగా ఆదుకుంటామని అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ చౌదరి సురేష్‌తో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ చెక్కులు అందజేత

నవతెలంగాణ - రెబ్బెన



బెల్లంపల్లి ఏరియాలోని గురువారం గోలేటి డిస్పెన్సరీ, ఖైరిగూడ ఉపరితల గని సమీపంలో 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్‌ను అందజేశారు. ఉద్యోగులు ఎస్ విజయలక్ష్మి(బైటీషన్ ఏరియా ఆస్పత్రి బెల్లంపల్లి), జె నాగహైమావతి(స్టాఫ్ నర్సు, ఏరియా ఆస్పత్రి బెల్లంపల్లి), నాగేశ్వర్‌రావు(హెడ్ ఓవర్‌మెన్, ఖైరిగూడ ఓసీ)కు బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బులను జాగ్రత్తగా పొదుపు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగులు క్రమశిక్షణతో పనిచేసి సంస్థ ఉన్నతికి కృషి చేయాలని కోరారు. ఖైరిగూడ ఓసీ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు ఉద్యోగులు సమిష్టి కృషి చేయాలన్నారు.

రూ.1450 కోట్ల ఏరియర్స్

- కార్మికుల బ్యాంకు ఖాతాల్లో రూ.1450 కోట్ల ఏరియర్స్
- సగటున ఒక్కొక్క కార్మికునికి రూ.3.70 లక్షలు
- రామగుండం ఏరియా ఓవర్‌మెన్‌కు అత్యధికంగా రూ.9.91 లక్షలు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి కార్మికులకు 11వ వేజ్ బోర్డు బకాయిల చెల్లింపు కింద సింగరేణి యాజమాన్యం గురువారం మధ్యాహ్నం రూ.1,450 కోట్లు విడుదల చేసింది. సీఎండీ ఎన్ శ్రీధర్ ఆదేశాల మేరకు డైరెక్టర్ (ఫైనాన్స్) బలరామ్ నేరుగా గని కార్మికుల ఖాతాలల్లోకి ఆన్‌లైన్ ద్వారా నగదు బదిలీ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ బలరామ్ మాట్లాడుతూ సింగరేణి చరిత్రలో ఇంత పెద్ద మొత్తంలో ఒకే దఫాగా ఏరియర్స్ చెల్లించడం సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 11వ వేజ్‌బోర్డు జీతాలను కూడా కోలిండియాతో పోల్చితే సింగరేణి ముందుగానే అమలు చేసింది.11వ వేజ్‌బోర్డు ఏరియర్స్ కోలిండియాలోని కొన్ని సబ్సిడరీ కంపెనీలు ఇంకా చెల్లించలేదని, దశలవారిగా చెల్లించడానికి సమాయత్తం అవతున్నాయని సింగరేణి అధికారులు పేర్కొన్నారు. కార్మికులకు చెల్లించే ఏరియర్స్‌లో ఇన్‌కమ్ టాక్స్, సీఎంపీఎఫ్, పెన్షన్‌కు చెల్లించాల్సి ఉన్న సొమ్మును మినహాయించి మిగిలిన మొత్తాన్ని కార్మికుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా గతంలో సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.700 కోట్ల లాభాల బోనస్‌ను దసరా పండుకు ముందుగానే చెల్లించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీపావళి బోనస్‌గా పేర్కొనే పీఎల్ఆర్ బోనస్ కూడా దీపావళి పండుగకు ముందుగా చెల్లించేందకు సంస్థ సంసిద్ధంగా ఉందని తెలిపారు. ఏరియర్స్ బోనస్ చెల్లింపుల విషయంలో కొందరు అనవసర అపోహలు కల్గిస్తున్నారని వీటిని కార్మికులు ఎవ్వరు నమ్మాల్సిన అవసరం లేదని అన్నారు. పెద్ద మొత్తంలో పొందిన సొమ్మును కార్మికులు పొదుపుగా వాడుకోవాలని, కుటుంబ భవిష్యత్తుకు వినియోగించుకోవాలని ఈ సంధర్భంగా పేర్కొన్నారు.

రూ.9.91 లక్షల ఏరియర్స్ పొందిన సింగరేణి టాపర్ సుదర్శన్‌రెడ్డి

రామగుండం-1 ఏరియాకు చెందిన వేముల సుదర్శన్‌రెడ్డి 11వ వేజ్‌బోర్డు ద్వార రూ. 9.91లక్షల అత్యధిక ఏరియర్స్ పొంది సింగరేణి టాపర్‌గా నిల్చారు. అదేవిధంగా రామగుండం-2 ఏరియాకు చెందిన ఈపీ ఆపరేటర్ మీర్జా ఉస్మాన్‌బేగ్ రూ.9.35లక్షలతో 2వ స్థానంలో నిలువగా శ్రీరాంపూర్ ఏరియాలో హెడ్ ఓవర్ మెన్‌గా పని చేస్తున్న ఆడెపు రాజమల్లు రూ. 9.16లక్షలతో 3వ స్థానంలో నిల్చారు. వీరితో పాటు ఆరు లక్షలకు పైగా ఏరియర్స్ పొందిన వారికి నేరుగా ఏరియర్స్ చెక్కులు అందజేస్తూ ఘనంగా సన్మానించారు.

గోలేటి వారసంతలో సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని సింగరేణి పరిసర ప్రాంతంలో గోలేటి గ్రామంలో ప్రతి గురువారం నిర్వహించే వారసంతలో సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు కస్తూరి రవికుమార్ డిమాండ్ చేశారు. గురువారం వారు వారసంత ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో దిగువన కురుస్తున్న భారీ వర్షాలకు బురదమయంగా మారిందన్నారు. వారసంతకు వచ్చే మహిళలు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వారసంతలో బురద లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే మంచినీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

పోగొట్టుకున్న మొబైల్ అందజేత



నవతెలంగాణ - బెజ్జూర్

మండల కేంద్రానికి చెందిన చిప్పకుర్తి పురుషోత్తం ఐదు నెలల క్రితం మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో తన మొబైల్ వెతికి పెట్టాలని పోలీసులకు ఐదు నెలల క్రితమే ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేయడంతో పురుషోత్తం మొబైల్ ట్రేస్ అయి దొరికింది. గురువారం పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు పురుషోత్తంకు తన మొబైల్‌ను అప్పగించినట్టు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. ఆయనతో పాటు ఏఎస్ఐ మోహన్ నాయక్, హోమ్‌గార్డు లక్ష్మణ్ ఉన్నారు.

కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని కాంట్రాక్టు కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోలేటి జీఎం కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జీఎం డి రవిప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి కాంట్రాక్టు కార్మికులందరికి జీవో 22 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. బోనస్ 10 శాతానికి తగ్గకుండా పెంచుతామని డైరెక్టర్ ఇచ్చిన హామీ నెరవేర్చాలని కోరారు. కాంట్రాక్టు కార్మికుల కుటుంబసభ్యులకు సింగరేణి ఆస్పత్రిలో ఉచిత మెడికల్ సౌకర్యం లేదా ఈఎస్ఐ సౌకర్యం కల్పిస్తామని, నర్సరీ వర్కర్లకు కనీస వేతనం, ఈపీఎఫ్ లేదా సీఎంపీఎఫ్ అమలుచేస్తామని, బోనస్ చెల్లిస్తామని యాజమాన్యం అంగీకరించింది అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు సెక్యూరిటీ గార్డులకు ఉచిత మెడికల్, ఉచిత యూనిఫామ్ హామీ నేటికి అమలు పరచలేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, కాంట్రాక్టు కార్మికుల వర్కింగ్ ప్రెసిడెంట్ రాయిళ్ల నర్సయ్య, బ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్, సీపీఐ గోలేటి పట్టణ కార్యదర్శి మారం శ్రీనివాస్, సహాయ కార్యదర్శి సాగర్‌గౌడ్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజలకు అవసరమైన ఆశ్రమం ప్రారంభం

నవతెలంగాణ - కౌటాల



తెలుగు రాష్ట్రాల భక్తుల సౌకర్యార్థం ఉత్తర్‌ప్రదేశ్‌లోని బృందావనంలో బ్రహ్మచారి శ్రీ స్వామి శివరామకృష్ణ ఆధ్వర్యంలో రాధాకృష్ణ తపోవన ఆశ్రమం ట్రస్టును ప్రారంభించనున్నట్టు ట్రస్టు ప్రధాన కార్యదర్శి సుల్వ కనకయ్య తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుండి 24వ తేదీ వరకు ఆశ్రమం ప్రారంభోత్సవ ప్రత్యేక పూజాభి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు, ఆశ్రమంలో ప్రత్యేక హెూమాలు, రాధాకృష్ణల విగ్రహ ప్రతిష్ఠ, బ్రహ్మచారి శ్రీ స్వామి శివరామకృష్ణ పీఠాదిపతి ఆదిపత్య మహెూత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఆశ్రమంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల భక్తులకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. మన తెలుగు రాష్ట్రాల నుండి తీర్థయాత్రలకు వెళ్లే భక్తులు ఇబ్బందులు కలుగకుండా ఈ ఆశ్రమం అందుబాటులోకి తీసుకొచ్చినట్టు ఆయన తెలిపారు. శ్రీ రాధాకృష్ణ తపోవన ఆశ్రమం ట్రస్టు ప్రారంభోత్సవానికి అందరికి ఆహ్వానం ఉన్నట్టు ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏవైనా సందేహాలు, సలహాలకు ఫోన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

గిరిజన గూడాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని రొట్టేపల్లి, కొలాంగూడ, సోనాపూర్, బాదుగూడెం, దొడ్డి గూడెం, జెండాగూడెం, సాలేగూడెం, గట్రాపల్లి, దేవపూర్, పెద్దగూడెం, పెద్దపూర్‌లలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గిరిజన గూడెల్లో అయన పర్యటించారు. ఒక్కొక్క కుటుంబంలో ఇద్దరు, ఐదుగురు జ్వరాలతో మంచం పట్టడంతో పాటు దొడ్డి గూడెంలో రెండు రోజుల కింద ఒక బాలుడు చనిపోవడం జరిగిందన్నారు. ఆయిన ప్రభుత్వం నిద్రమత్తు విడటం లేదని అన్నారు. తమ ప్రాణాలను కాపాడుకోవడం కోసం ప్రయివేట్‌లో వైద్యం చేయించుకొని ప్రతి కుటుంబానికి రూ.5వేల నుంచి రూ.15వేల వరకు అప్పులు చేసి ఖర్చు చేసుకొని ప్రాణాలను కాపాడుకోవడం జరిగిందన్నారు. బాధితులు ప్రయివేట్‌లో వైద్యంపై ఆధారపడి పోతుంటే మరి ప్రభుత్వ ఆస్పత్రులు, డాక్టర్లు, సిబ్బంది ఎవరికి వైద్యం చేస్తున్నారని విమర్శించారు. గ్రామాల్లో దోమల మందు కొట్టడం లేదని అన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదన్నారు. పారిశుధ్య పనులను చేపట్టడం లేదన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఎం చేస్తున్నట్లని ప్రశ్నించారు. తక్షణమే అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఈ పర్యటనలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు, సిడాం జంగుబాయి, కాసిపేట మండల నాయకులు పాల్గొన్నారు.

సుమన్ ఆగడాలను అడ్డుకోవడానికే కాంగ్రెస్‌లోకి...

నవతెలంగాణ-మందమర్రి



ఎమ్మెల్యే సుమన్ ఆగడాలను అడ్డుకోవడానికే కాంగ్రెస్‌లో తాము చేరినట్టు మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పేర్కొన్నారు. గురువారం తన నివాసంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. తాను 3 సార్లు చెన్నూరు నియోజకవర్గం నుంచి గెలుపొందానని అన్నారు. నియోజకవర్గంలో స్థానికేతరుడు అయినటువంటి బాల్క సుమన్ ఆగడాలను అడ్డుకుని ఇక్కడి నుంచి సాగనంపాలని అన్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల మళ్లీ బీఆర్ఎస్‌లో కేసీఆర్, కేటీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇస్తామనే హామీతో బీఆర్ఎస్‌లో చేరి మోసపోయి పెద్ద తప్పు చేసానని ప్రజలు కార్యకర్తలు అభిమానులు ఓటర్లు క్షమించాలని కోరారు. కాంగ్రెస్ టికెట్ ఎవరికి వచ్చినా అభ్యర్థి ఎవరైనా పార్టీ గెలుపే లక్ష్యంగా శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. చెన్నూరు నియోజకవర్గంలో ఒక రాచరిక అరాచక నియంత పాలన నడుస్తుందని తెలిపారు. ఒకప్పుడు నిజాం పాలన ఉండేదని చెప్పుకునే వాళ్లమని దానికి సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినంగా జరుపుకుంటామని కానీ ఇప్పటికీ నియోజకవర్గంలో రాచరిక పాలన ఆత్మగౌరవం లేని పాలన కొనసాగుతుందని అన్నారు. దీన్ని అంతమొందించి ప్రజలకు విముక్తి కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా జెడ్పీ ఛైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, దుర్గం నరేష్, బచ్చలి భీమయ్య, నల్లాల జలపతి పాల్గొన్నారు.

పలుకుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కడెం

మండలంలోని సారంగాపూర్ గ్రామంలో ఇటీవల సందు మహేందర్, బండపల్లి పోషగౌడ్ మరణించిగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ గురువారం సారంగాపూర్‌లోని వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనంతరం కడెం మాజీ ఎంపీపీ మొలుగురి రాజేశ్వర్‌గౌడ్, మొలుగురి రాము సర్పంచ్ మాసాయిపేట్ తండ్రి మొలుగురి కొమురయ్య బుధవారం మరణించగా వారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. పాడే మోసి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. రాజేశ్వర్‌గౌడ్‌ని, రాముగౌడ్ వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట కడెం మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, కడెం జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు నల్ల జీవనరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ నాయకులు, కోల శ్రీనివాస్, కుమ్మరి భూమన్న, శనిగారపు శ్రావణ్, జెట్టి నర్సయ్య, కుమ్మరి నర్సయ్య, కాశెట్టి రాజేందర్, పుప్పాల లింగన్న, ఆర్మూర్ అనిల్, కాసుల నర్సయ్య, రాజేశ్వర్, కే.నరేష్ కార్యకర్తలు ఉన్నారు.

అమ్మిన భూమిపై ఆరోపణలు చేయడం సరికాదు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని ముత్యంపల్లికి చెందిన బరిగల ఆశాలు తన భూమిని అమ్మి ఇప్పుడు అమ్మలేదని ఆరోపణలు చేయడం సరికాదని ఉప్పులేటి శ్రీనివాస్ దంపతులు ఆరోపించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ నలుగురు సమక్షంలో కొనుగోలు చేసే రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని లాక్కున్నట్లు ఆరోపణ చేయడం సరికాదన్నారు. బరిగల ఆశాలు తన నాలుగు ఎకరాల భూమిని తెలియకుండా పట్టా చేయించుకున్నాడని చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. 12 సంవత్సరాల కింద కొనుగోలు చేస్తే ఇప్పుడు వారి మానసిక పరిస్థితి సక్రమంగా లేక ఆరోపణ చేస్తున్నారని అన్నారు. గ్రామ పెద్దలు, వారి కుటుంబ సభ్యులు సైతం కొనుగోలు చేసినట్లు చెబుతున్నారని అన్నారు. ఆరోపణలతో తమను మానసికంగా క్షోభకు గురి చేయడం సరికాదన్నారు. ఈ సమావేశంలో కులపెద్దలు లంక లక్ష్మణ్, గుడిసెల భీమయ్య, రాయమల్లు ఉన్నారు.

ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఓటరు నమోదు దరఖాస్తులను పరిశీలించి, నిబంధనలు అనుసరిస్తూ ఆన్‌లైన్‌లో ప్రక్రియ వేగవంతం చేయాలనీ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పట్టణ తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులకు భారత ఎన్నికల కమిషన్ నిబంధనలు అనుసరిస్తూ ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తిచేయాలని అన్నారు. ప్రతి ఒక దరఖాస్తుకు జతపరిచిన ధృవీకరణ పత్రాలు, సంతకాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూపర్‌వైజర్లను ఆదేశించారు. బూత్ స్థాయి అధికారుల నుంచి ఈఆర్ఓ వరకు పరిశీలన పూర్తైన అనంతరం ఏఈఆర్ఓ లాగిన్ ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. గరుడ యాప్, ఎన్వీఎస్‌పీ పోర్టల్ ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు రాబోయే ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గ అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లలో భాగంగా స్థానిక టీటీడీసీలోని స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాలు, పార్కింగ్ స్థలాన్ని పరిశీలించి, అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ స్రవంతి, పట్టణ తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలంద ప్రియా, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-కుభీర్

పురుగులమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సోమేశ్వర గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమేశ్వర గ్రామానికి చెందిన రాథోడ్ ప్రహ్లాద్(31) బుధవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో, గుర్తు తెలియని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయట నుంచి ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు చూసే సరికి నోటి నుంచి నురుగు రావడంతో వెంటనే భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడి ఆర్థిక ఇబ్బందులకు ఎక్కువ కావడంతో గత కొన్ని నెలలుగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు మృతుడి భార్య జయబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కూతుళ్లున్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపి, పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం పట్ల ఎమ్మెల్యే జోగు రామన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత, బీఆర్ఎస్ ప్రభుత్వం చొరవ కారణంగానే బిల్లుకు మోక్షం లభించిందన్నారు. ఈ బిల్లు ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని తెలిపారు. మహిళలకు సమాన హక్కులు కల్పించేందుకు బీఆర్ఎస్ అలుపెరుగని పోరాట ఫలితమే పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టడమన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కవిత 47 పార్టీలను ఐక్యం చేశారని తెలిపారు. మార్చి 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష కూడా చేపట్టారని ఎమ్మెల్యే గుర్తుచేశారు.

పండ్ల తోటలు పెంపకంపై ప్రణాళిక సిద్ధం చేయాలి



నవతెలంగాణ-సారంగాపూర్

రైతులు కూరగాయల పంటలతో పాటు పండ్లతోటల పెంపకంపై ఆసక్తి చూపుతున్నారని ఎంపీపీ మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం సారంగాపూర్ మండలంలో ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, మండల ఏఈఓలతో సమావేశం నిర్వహించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసుకొనే రైతులకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా తోటల పెంపకానికి ప్రోత్సాహన్ని అందిస్తుందన్నారు. గ్రామాల్లో రైతులకు అవహన కల్పించి, పండ్ల తోటలు పెంపకంపై ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఇంకుడు గుంతలు, పరిశుభ్రతపై దృష్టి సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఏఓ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలో బిజెపి కార్యాలయాన్ని గురువారం మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. బిజెపి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కొడిమెల లక్ష్మణ్, సాగర్‌గౌడ్, స్వామి, రాజు, రాజేశం, వెంకన్న, రాయమల్లు పాల్గొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

నవతెలంగాణ-కుభీర్

రాబోయే రోజుల్లో తెలంగాణలో బిజెపి ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భోస్లే మోహన్‌రావు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని సిరిపెల్లి, సిరిపెల్లితండా-1, డోడర్నాతండా గ్రామాల్లో పల్లెపల్లెకు బిజెపి-గడప గడపకు మోహన్‌రావు పటేల్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముందుగా గ్రామాల్లో బీజేపీ జెండాలనున ఆవిష్కరించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమంలో మోహన్‌రావు పటేల్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఇంట్లో ఇద్దరికి పెన్షన్ అందించేందుకు కృషి చేస్తామన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో బడుగు, బలహీన ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదని తెలిపారు. దళితులకు దళితబంధు, దళితబస్తీ, బీసీబంధు కొంత మందికే వచ్చి పార్టీ కార్యకర్తలకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందిస్తున్నారని విమర్శించారు. రానున్న రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వ నికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. ఆయన వెంట ఆయా గ్రామాల బిజెపి కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీలు ఉన్నారు.

జాతి సమైక్యతకు నిదర్శనం వినాయక ఉత్సవాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

వినాయక ఉత్సవాలు జాతి సమైక్యతకు నిదర్శనమని కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్ అన్నారు. గురువారం మావల మండలంలోని వాగాపూర్‌లో ఫ్రెండ్స్ గణేష్ ఉత్సవ సమితి ఆహ్వానం మేరకు మహాగణపతి పంచామృత అభిషేకం పూజ హారతి కార్యక్రమంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమకారుడు బాలగంగాధర్ తిలక్ గణేష్ ఉత్సవాలను ప్రారంభించి జాతిని సమైక్యపరిచారని తెలిపారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి కార్యకర్తలు శాంతపురి శ్రీకాంత్, ప్రవీణ్, శంకర్, నరేష్, విక్రమ్ పాల్గొన్నారు.

పాపహరేశ్వర ఆలయంలో మహేశ్వర్ రెడ్డి ప్రత్యేకపూజలు

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండలంలోని కదిలి పాపహరేశ్వర ఆలయంలో మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రచారంలో భాగంగా మొదట కదిలి పాపహరేశ్వర ఆలయాన్ని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. పురాతన ఆలయంలోని పాపహరేశ్వర స్వామి చాలా మహిమాన్వితుడని, అందుకే ప్రతీ ఏట ఈ ఆలయాన్ని దర్శించుకుంటానని తెలిపారు. ఆయన వెంట జెడ్పీటీసీ తక్కల రమణరెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వీరేష్ కుమార్, నాయకులు ముత్యంరెడ్డి, సత్యం చంద్రకాంత్, శైలేశ్వర్, డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, సాయిరెడ్డి, నర్సారెడ్డి, ఉత్తంపటేల్, శివాజీ పటేల్, పరుశురాం పటేల్, రాము, నర్సయ్య, బోజరామ్ పటేల్, సుధాకర్, ప్రసాద్ పటేల్, హరిలాల్, మల్లేష్, సందీప్‌గౌడ్, రత్నం, సుధాకర్ పాల్గొన్నారు.